# వాచాలుడు

మనిషి నాలుకగల వింత పశువు.

మనిషి నాలుగు కాళ్ళ పశువు అంటారు. కాని సాయి ఆ మాట ఒప్పుకోడు. అతని దృష్టిలో నాలుకగల పశువు.

ఆ నాలుగు కాళ్ళ పశువు పరుగెడుతుంది. తన్ను తాను రక్షించుకుంటుంది. పోరాడుతుంది. కాని నాలుక గల పశువు అలా కాదు. ఆ నాలుకతో నే తన గోతిని తవ్వుకుంటుంది.

భాషాశాస్త్రం- నాలుక గురించి మురిసిపోనక్కరలేదు. సాయి దృష్టిలో నాలుక వలన లాభాల కంటే నష్టాలే ఎక్కువ! పశువులకు నాలుక లేకపోబట్టి కలిసిమెలసి ఉంటున్నాయి. కష్టసుఖాలు పంచుకుంటున్నాయి.

మనిషి పశువును ఆ నాలుక వేరు చేస్తున్నది – తాత్కాలికంగా అతి దగ్గరగా చేరదీస్తున్నది అని అనిపించినా విడదీయడానికి, శాశ్వతంగా విడిపోవడానికి అది ఎంతో కాలం పట్టదు.

ఇంతకీ సాయి ఇలాంటి అభిప్రాయానికి ఎందుకు వచ్చాడో....

సాయి చరణ్ ఒక ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు. ఆశలు అందలం ఎక్కుతూ ఉంటాయి గాని, అతను మటుకు పాతాళం దగ్గర పయనిస్తూ ఉంటాడు.

సాయి అంత సత్తాలేని మనిషి అయితే ఏం కాదు. కాని అతనికున్న బలహీనత నమ్మిక! అందరినీ తెగనమ్ముతాడు. అవతలివాడ్ని చూస్తే ఆప్యాయంగా కౌగలించుకుంటాడు. అవతలివాడు ఓ కప్పు కాఫీ కొట్టించి, కాస్త మర్యాద చేస్తే చాలు – నాలుకకు నరం తప్పుతుంది. అది సొల్లు కార్చుకుంటూ నృత్యం చేస్తుంది.

నాలుకకు కొత్త పాత తెలియదు – ఏది నరంలోకి వస్తే అది బయట కక్కేస్తుంది.

ఏమరుపాటున కొన్ని అంతరంగిక విషయాలు , కొన్ని రహస్యాలు కూడ బయటకు పరుగెత్తుకుంటూ వస్తాయి. మెదడు నాలుక చేసిన తప్పు గ్రహించేటప్పటికీ సమయం మించిపోతుంది.

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే – ఆ కాలిన గాయాలు నయమవుతాయేమో గాని నాలుక జారిన తరువాత దాన్ని ఎలా వెనక్కి తీసుకురావాలో ఎవరూ కనిపెట్టలేదు.

సాయిచరణ్‌కు కూడ తెలియదు ఏం చేయాలో!

"అయ్యో! ఎంతపని జరిగింది – అది చెప్పకుండా ఉండాల్సింది".

"ఆహా! అనవసరంగా ఆ విషయం ఎందుకు చెప్పానబ్బా".

"అతడు ఆవిషయాన్ని కడుపులో దాచుకుంటాడో దాచుకోడో?"

ఇట్లా సాగుతాయి అతని ఆలోచనలు, నాలుక జారింతర్వాత.ఆ రోజు ఏం జరిగిందంటే...

"ఆ ఆఫీసరు వట్టి వెధవ! వాడికేం రాదు.. రూల్సు తెలియవు. అడ్మినిస్ట్రేషన్ అంతకంటే తెలియదు", అని అనాలోచితంగా గురుదత్తుకు చెప్పాడు.

సదరు ఆఫీసరు పేరు ఆనందరావు. అతను ఓ మాదిరి మంచివాడే! కాని మంచివాళ్లు అసమర్థుల కింద లెక్కకదా లోకానికి. సాక్షాత్తు పాము మంచిగా పోయినా దాన్ని బ్రతకనివ్వరు, లెక్క చేయరు. అదే బుసలు కొట్టడం మొదలెడితే తప్పుకు పోతారు.

సాయిచరణ్ ఆ అభిప్రాయానికి రావడానికి కారణాలు కొన్ని ఉన్నాయి. కొన్ని సార్లు ఇతనే అతనికి ఫలానా సర్క్యులర్ ఉంది, దాని ప్రకారము అది తప్పు ఇలా చేయండి అని సలహా యిచ్చాడు.

కొన్ని క్లిష్ట సమయాల్లో కొన్ని సలహాలు అడిగితే సాయి సూచించగా అతను ఇతను చెప్పినట్లు నడుచుకున్నాడు.

ఆ రోజు ఆఫీసర్లపైన మిత్రబృందంలో చర్చలు జరిగేయి.నలుగురు చేరి రకరకాల అభిప్రాయాలు వెల్లడించేరు. చివర్లోసాయి సైలెంటుగా వున్నా అతన్ని బలవంతం చేసి అడిగారు.అతని అభిప్రాయాన్ని వెల్లడించాడు.

న్యూటన్ థర్డ్‌లా కరెక్టు కాకుండా ఎలా పోతుంది. కాకపోతే కొంతకాలం తీసుకుంటుంది. అంతేగా!

నలుగురు అన్నమాటలు పోయి ఆనందరావుకు సాయి అన్న మాటలు మాత్రంచేరాయి. ఆ చేరడం కూడా కొంత మసాలాతో చేరేయి. సాధుశీలి అయిన ఆనందరావు చాలా బాధపడ్డాడు. అతనికి తెల్సి తను సాయిని బాధపెట్టింది లేదు. మరి ఎందుకు అతను తన గురించి యిలా కామెంటు చేశాడని కొన్నాళ్ళు అతనికి నిద్ర పట్టలేదు కూడా.

ఇక సాయి విషయానికొస్తే అతను నిత్యం కొందరు దేవుళ్ళని కొలుస్తాడు. కొందరిని వదిలేస్తాడు.

కాని ఏదో మాటల సందర్భంలో రామానంద్ తన దేవుడు గొప్ప అని వాదిస్తే... సాయి ఊరుకోకుండా తన దేవుడే గొప్ప అని వాదించాడు. ఇంకా ఒక మెట్టుపైకి పోయి మీ దేవుడు వట్టి అసమర్థుడు అని ఖండించేడు కొన్ని జానపద ఘట్టాలు - కొన్ని పుక్కిట పురాణాలు తీసుకొచ్చి రామానంద్ అతన్ని తనవైపు మరల్చుకోవడానికి చూశాడు గాని అతను తన పట్టు వదలలేదు. రామానంద్ తన వాదన మానుకుని వెళ్ళాడు కాని... సాయి అదే విషయం ఆలోచిస్తూ ఇంట్లో శ్రీమతికి చెప్పాడు.

"అయ్యో! దేవుళ్ళందరూ ఒక్కటే కదండి! ఒకే శక్తికి భిన్న రూపాలు! ఎవరిని అగౌరవపరచినా ఆ పరమాత్మను అగౌరవ పరచినట్టేకదా! రావణాసురుడు గొప్ప శివభక్తుడైనా - శ్రీమన్నారాయణుని దూషించడం వలననే కదా చావు కొని తెచ్చుకుంది. సాక్షాత్తు రావణబ్రహ్మ అయి వుండి అల్పాయుష్కుడుగా కేవలం లక్షపై చిలుకు సంవత్సరాలకే చనిపోయింది" అని చివాట్లు పెట్టింది.

అప్పటికి అతని మత్తు దిగింది.

కాని అప్పటికే అతని ఖాతాలో కొంత పాపం జమయిపోయింది.చేసుకున్న పుణ్యం తరిగిపోయింది.

ఓ రోజు తన కొలీగు సుహాసిని ఎవరితోనో షాపింగుకు పోవడం అతని కంటపడింది.కుతూహలం చాలా చెడ్డది. వాళ్ళనే చాలాసేపు గమనించాడు.సుహాసిని అనుకున్న యువకుడు ఆమెతో కులాసాగా కబుర్లు చెబుతూ , వీలైనంత ఎక్కువగా ఆమెను తాకుతూ నవ్వుతూ తుళ్ళుతూ ఉన్నాడు. ఆమె కుడా రిజర్వ్డుగా లేకుండా కొంచెం హుషారుగా ఉంది. ముద్ద పప్పు అని ఇతని కొలిగ్స్ ఆమెకు పెట్టిన ముద్దుపేరు. మరి ముద్ద పప్పేమిటి , ఇలా హుషారుగా తిరగడమేమిటి అని ఆశ్చర్యపోయి - ఆ ఆశ్చర్యాన్ని కప్పిపుచ్చుకోలేక గురు దత్తుకు చెప్పాడు జరిగిన సంగతి.

"మనం అనుకున్నట్లుగా ముద్దపప్పు - ముద్దపప్పు కాదు. సూరే కారంలా ఉషారుగా ఉంటుంది!" అని వ్యాఖ్యానించాడు.

గురు దత్తుకు అసలే కడుపుబ్బు రోగం ఉంది. చాలా మందికి పడని పదార్థాలు తింటే అజీర్తి చెయ్యడం - కడుపు ఉబ్బిపోయి సరియైన వైద్యం చేసుకునే దాకా తగ్గదు. గురుదత్తుకు దాకా తగ్గదు. గురుదత్తుకు ఏదైనా కొత్త విషయం వింటే కడుపు అంతా బిర్రబిగుసుకు పోయి దాన్ని ఎవరికైనా చెప్పే

దాకా తప్పదు.

గురుదత్తు ఫలానా సాయి ఇలా చెప్పేడని ఆఫీసంతా టాంటాం వేశాడు. ప్రపంచం టెలీ కమ్యూనికేషన్లలో అద్వితీయమైన ప్రగతి సాధించింది కామోసు - సాయంత్రంకల్లా ఈ వార్త చేరవలసిన వాళ్ళకి చేరిపోయింది.

ఐదయిన తర్వాత సీటు సర్దుకుని వెళ్ళబోతున్న సాయి దగ్గరకు ముద్దపప్పు వేంచేసింది.

"ఏం సుహాసినిగారూ! అప్పుడే వెళ్ళిపోతున్నారా?" నవ్వుతూ అడిగాడు.

"నేనెప్పుడు వెళితే మీకెందుకు ? ఎక్కడికెళితే మీ కెందుకు ? మైండ్ యువర్ బిజినెస్!" చాలా కోపంగా అంది అతడిముందు కూర్చుంటూ.

సాయి చరణ్ ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు.

"ఏదో సరదాకి అన్నాను". తడబడ్డాడు.

"షటప్! నాగురించి మీకేం తెలుసు? నేనేం చేస్తున్నది ఇంటికొచ్చి చూశారా? నేనేమీ వేశ్యను కాను ఎవరితో పడితే వాళ్లతో తిరగడానికి...." ఆవేశంతో ఆమెకు కళ్ళ వెంబడి నీళ్ళు వచ్చాయి.

"అయ్యో! అలా అని ఎవరున్నారు?" అని విస్తుపోయాడు.

"ఏమీ తెలియనట్లు నంగనాచి కబుర్లు చెప్పకు. ఎంతో మంచివాడివనుకున్నా. ఇంత కుళ్ళుబోతు తనం లోపల ఉందనుకోలేదు. ఇదే మీ చెల్లెలయితే యిలా అంటావా?" సుహాసిని కళ్ళు తుడుచుకుంది.

అతనికి కొంచెం కొంచెం అర్థమయింది.

"అబ్బే - అసలు నేనేం చెప్పానంటే..."

"డోంటాక్! నా జోలి మీకెందుకు? నేను మీకేమవుతాను ఉంచుకున్నదాన్నా? కట్టుకున్న పెళ్ళాన్నా? మీకేమన్నా ద్రోహం చేశానా ? నావలన ఎవడన్నా చెడిపోయాడా? మా పర్సనల్ విషయాలు మీకెందుకు?" ఆవేశంతో ఆమె ఛడామడా తిట్టేసింది. ఇతను ఏదో చెప్పబోయినా ఆమె వినలేదు గబగబా పది నిముషాలు అరిచేసి వెళ్ళిపోయింది.

సాయికి దత్తుడిపైన చాలా కోపం వచ్చింది. డైరెక్టుగా అతని దగ్గర కొచ్చాడు.

"రాస్కెల్! నేను నీకు ఏం చెప్పాను? నిన్ను నమ్మి చెబితే నువ్వు ఆమెకు చెబుతావా?"

"నేనేం ఆమెకు చెప్పలేదు".

"అసలేం చెప్పావు?"

"నువ్వు చెప్పిందే! ఆమె ఎవరితోనో తిరుగుతున్నాదని."

"అవును - నేను నీకు చెబితే నువ్వు ఎవరికి చెప్పావు? అందరికీ ఎందుకు చెప్పావు?"

"నేనేం అబద్ధం చెప్పలేదే ? నువ్వు చెప్పిందే చెప్పాను - పైగా నువ్వేం రహస్యమని చెప్పలేదు గదా?" దబాయించాడు దత్తు.

నిన్ను "ఛీ! నేను నమ్మడం నాది బుద్ధి తక్కువ . మీరంతా బాగానే ఉన్నారు..... మధ్యలో నా ప్రాణానికొచ్చింది."

సాయి భాధపడి యింటికి చేరుకునన్నాడు.

అది అంతటితో పోయిందనుకున్నాడు కాని పోలేదు... ఆవిషయం మేనేజర్ చెవిలో దూరింది. అతను ఆర్కైయివ్స్ డిపార్టుమెంటులో ఉండదగినవాడు. ఏదన్నా తన దాకా వస్తే దాన్ని భద్రంగా దాచి

పెట్టుకుంటాడు. అది అవసరమా , అనవసరమా అని ఆలోచించడు కంప్యూటర్‌లోగా పర్మనెంట్‌గా రికార్డయిపోతుంది.

ఏదో విషయం మీద సాయిని పిలిచి నాలుగు వాయించాడు. దాంలో ఇది కూడా ఉంది- "ఏంటి? నువ్వు ఆడపిల్లల్ని ఏడిపిస్తున్నావట? మన కొలీగ్స్ జోలికి పోయినట్లు ఇంకోసారి నాకు తెలిస్తే నిన్ను సస్పెండ్ చేయిస్తాను. జాగ్రత్త"!సాయికి మతి పోయింది. నాలుక జారాడు ఎంత దూరం తీసుకుపోయింది.

ఒకసారి శ్రీమతి అలివేలు మంగతాయారు ఓ విషయం చెప్పింది తన కజిన్‌సుబ్బలక్ష్మి గురించి. "దానికి చిన్నప్పటినుంచి జబ్బులే జబ్బులే. అసలది బ్రతకదనుకున్నారు. అయినా బ్రతికింది. ఒకటే సుస్తీ మనిషి, అల్పాయుష్కు రాలు తుమ్మితే ఊడిపోయే ముక్కు దానిది. " అంటూ సుబ్బలక్ష్మి జబ్బుల గురించి ఏకరువు పెట్టింది. "అటువంటి దానికి అదృష్టము కొద్దీ మంచి మొగుడు దొరికాడు - లక్షల ఆస్తిపరుడు. కారులు,నౌకర్లు - ఓ(! దాని వైభవం చెప్పలేం!"

ఓ బంధువుల పెళ్ళిలో చుట్టాలంతా కలిశారు. పిచ్చాపాటి కబుర్లు ....విసుర్లు జోకులు జరిగేయి.

"మీ సుబ్బలక్ష్మికి ఆరోగ్యం బాగుందా?" హఠాత్తుగా అడిగాడు సాయి సుబ్బారావును.

"దానికేం ,దిబ్బరొట్టె లాగుంది. అయినా మీకెందుకా అనువానం "అనుమానంగా అడిగాడు సుబ్బారావు.

"ఏం లేదు - బాగుంది? కదా!"

"అంటే ఏదో దాస్తున్నారు - నాతో చెప్పడానికేం..."

"అబ్బే ! మీకు తెలియందేముంది - కాపురం చేస్తున్నవాళ్ళు!"

"అదేదో చెప్పొచ్చుగా - సస్పెన్స్‌లో పెట్టి చంపకపోతే...."

"ఆహా! బాగుంది కదా!"

"అవునయ్యా !చక్కగా ఉంది... అయితే...."

"అంత బావుండేది కాదు... ఇప్పుడు కులాసా చిక్కింది కదా!"

"ఎప్పుడు?"

"చిన్నప్పుడు అది ఒట్టి సుస్తీ మనిషి . అసలు బ్రతకదనుకున్నారు. కాని దేవుడి దయవల్ల ఆరోగ్యము కుదుటపడి మీతో పెళ్ళయింది."

"అల్లాగా... మాఊరి నీళ్ళు పడక జబ్బు పడ్డానంటుంది తను "సుబ్బారావు సాలోచనగా అన్నాడు.

ఆ సంభాషణ అంతటితో ఆగిపోయింది. సాయి కూడా మర్చిపోయాడు. కాని పర్యవసానం ఆరునెలల తర్వాత తెల్సింది.

"అయిన వాళ్ళు ఇంత ద్రోహం చేస్తారని తెలియదు. అయినా మీకు మేమేం అపకారం చేశాం- మా అమ్మాయి కాపురంలో చిచ్చుపెట్టారు. పచ్చగా ఉంటే కళ్ళుకుడతాయి. ఒకరు బాగుపడుతుంటే చూడలేరు. అయినా భగవంతుడు ఊరుకోడు. తగినబుద్ధి చెబుతాడు."

ఇలా పిన్నిగారి నించీ ఒక ఉత్తరం అందుకుంది అలివేలు మంగతాయారు. ఆ ఉత్తరం సాంతం చదివిన ఆమెకు మతిపోయింది. సాయి యింటికి రాగానే సత్యభామ అవతారం ఎత్తి విరుచుకుపడింది. పెళ్ళయిన ఇన్ని సంవత్సరాలలో అంత కోపంగా ఆమెని ఎరుగడు. కురుక్షేత్ర యుద్ధంలో నిదానంగా అన్ని విషయాలు బయటకొచ్చాయి.

"పాపం! సుబ్బలక్ష్మి! మీకేం అపకారం చేసింది? ఇప్పుడు దాని కాపురం కష్టాల్లో పడింది. చీటికి మాటికి జబ్బు చేస్తున్న సుస్తీ మనిషి నాకు వద్దు అంటున్నాడుట వాళ్లాయన! ఎవరు చెప్పారు అంటే మీరుట! చిన్నప్పటినుంచీ అది వట్టి జబ్బు మనిషని ప్రచారము చేశారట!" అంటూ వలవల ఏడ్చేసింది.

సాయికి చాలా కోపంగా వచ్చింది సుబ్బారావు మీద.

"మీకు దండం పెడతానండీ! నేనేమన్నా మా వాళ్ళ గురించి చెప్పి ఉంటే మర్చిపోండి..... అవి వాళ్ళకు చేరవేయవద్దు."

"అయ్యో! నేను కావాలని చెప్పలేదు. సదుద్దేశంతోనే అడిగెను. వాడు ఇలాంబటి అర్థాలు తీసుకుంటాడనినాకేం తెల్సు?"

"వాళ్ళు గంగలో దూకన్వీండి మన కెందుకు? ఇప్పుడు చెడ్డపేరు ఎవరికొచ్చింది – మీకూ నాకూ – పిన్ని నాకు తెల్సి ఎప్పుడూ యింత నిష్టూరము పోలేదు."

"అయ్యో! ఉత్తరం రాయి – నేను ఏమీ చెప్పలేదని."

ఆ రాత్రి ఆమెని బుజ్జగించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది.

ఎంతో దూరంగా వున్న పిన్నిగార్కి, యస్టీడీ చేసి జరిగిన విషయం వివరించారు. అయినా ఆమె అంగీకరించలేదు. ఒకవేళ వాళ్ళ కాపురం కూలిపోతే దాని బాధ్యత మీదేనని తేల్చి చెప్పేసింది.

ఇంక వాళ్ళ కాపురం బాగుండాలని వెయ్యి దేవుళ్ళకి మొక్కుకున్నారు. తిరుపతి వెంకన్నకు తన తల నీలాలు కూడా సమర్పిస్తానని మొక్కుకున్నాడు సాయిచరణ్. శ్రీశైలం మల్లన్నకు అభిషేకంబెజవాడ కనకదుర్గ చేయిస్తానని మొక్కుకున్నాడు. అమ్మవారికి కుంకుమాభిషేకం చేయిస్తానని మొక్కుకుంది తాయారు.

సాయికి తన నాలుకపైన చాలా కోపం వచ్చింది. దాన్ని పూర్తిగా అదుపులో ఉంచాలన్న నిర్ణయం తీసుకున్నాడు.

ఇలా కొన్నాళ్ళు గడవగా...

సాయి ఊళ్ళో జరిగిన ఒక ఉపన్యాసానికి వెళ్ళేడు. ఒక స్వామీజీ భాగవతం మీద ఉపన్యాసం ఇచ్చారు. జనమంతా మంత్రముగ్ధులైపోయారు. సాయి కూడా చాలా ఆనందించాడు.

అయిపోయింతర్వాత నలుగురైదుగురు కల్సినడుస్తూ స్వామీజీని ప్రశంసించారు.

"గొప్ప తపస్సంపన్నులు స్వామీజీ!"

"ఘటనాఘటన సమర్థులు!"

"ఆయన తల్చుకుంటే ఏమైనా చేయగలరు"

"పంచభూతాలపైన అదుపు కూడా సాధించారు" ఓ వ్యక్తి అన్నాడు. సాయి అతన్ని తేరిపార చూశాడు.

"నిజంగానా?"

"దాంలో సందేహమేముంది?" ఆ వ్యక్తి పరిచయస్తుడే! పెద్ద స్నేహం లేకపోయినా అతనెక్కడ పనిచేసేది ఇతనికి తెలుసు యితనెక్కడ పనిచేసేది అతనికి కూడా తెలుసు.

"అయితే చూడండి తిప్పయ్యగారూ! మన రాష్ట్రంలో కరువు తాండవిస్తోంది కదా! వర్షాలు కురిపించమనండి!" సాయి ఛాలెంజీ చేశాడు.

"సాయిగారూ! వర్షాలు కురిపించాల్సిన ఖర్మ ఆయనకేం పట్టింది?" అన్నాడు తిప్పయ్య.

"కర్మ అని కాదు... ప్రజల ఉపయోగం కోసం – తనుంటున్న రాష్ట్రంలో వర్షాలు

కురిపించవచ్చుగా..." సాయి అన్నాడు.

"బాగుంది... బిర్లా టాటాలు యింకా చాలామంది కోటీశ్వరులున్నారు మనదేశంలో. బీదవాళ్ళున్నారు కదా అని, వాళ్ళు తమ సంపదను దానాలు చేస్తూ పోతారా?... అలా చేస్తూ పోతే చివరకి వాళ్ళే అడుక్కునే స్థితికి వస్తారు."

"వాళ్ళ సంగతి వేరు – వీరు ఆధ్యాత్మికులు – వారు లౌకికులు! చేతనైతే వర్షాలు కురిపించి తమ సత్తా నిరూపించుకోమనండి."

"అంటే వర్షం కురిపిస్తేనే గాని ఆయన గొప్పవాడని నమ్మరా?"

"అంతేగా మరి! ఆయన దగ్గర శక్తి ఉందని మనకెలా తెలుస్తుంది? ఆయన నిరూపించుకుంటేనే కదా!"

"ఆయనకు నిరూపించుకోవలసిన అవసరంఏముంది! ఆయన గొప్ప శక్తిగలవాడని చెప్పగలను." తిప్పయ్య

"ఇవన్నీ కబుర్లండి బాబూ! చెవిలో పువ్వులు పెట్టుకున్న వాళ్ళకు చెప్పండి. ఒక డాక్టరయితే "అంతేగా మరి! ఆయన దగ్గర శక్తి ఉందని మనకెలా తెలుస్తుంది? ఆయన నిరూపించుకుంటేనే కదా!" వైద్యం చేయాలి. స్వామీజీగా గొప్ప వాడైతే ప్రజలకు ఉపయోగపడాలి" సాయి ఎగతాళి చేశాడు.

"ఎవరి కర్మ వాళ్ళది – అందరి ఖర్మనూ ఆయన ఎందుకు సరి చెయ్యాలి?" తిప్పయ్య విసుగ్గా అన్నాను.

"అటువంటప్పుడు తన గొప్పవాడినని చెప్పకోకూడదు. మనలాగా అసమర్థుడిలా నోరు మూసుకుకూర్చోవాలి!"

"మిష్టర్ ! స్వామిజీని తూలనాడితే కళ్ళు పోతాయి–."

"ఆ(! ఇలాంటి మాటలకే కళ్ళు పోతే ఈ పాటికి దేశంలో సగం మందికి కళ్ళు పోయుండాలి. అయినా స్వామిజీ ల భాగవతం ఎవరికి లేలీదు? కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. ప్రజల బలహీనతని ఆధారం చేసుకుని భూముల్ని ఆక్రమించడము – అమ్మాయిలని మోసం చేసి అనుభవించడము , హత్యలు చేయించడము , చాలామంది చేస్తున్నారు" సాయి నిరసన తెలిపాడు.

తిప్పయ్య మౌనం వహించాడు.

సాయి సర్దుకున్నాడు అతని మౌనాన్ని చూసి.

"నాకెందుకు లెండి . ఎవరి గొప్పతనం వారిది – మ నకెందుకు?" అని విడిపోయారు.

సాయి ఆ సంఘటన మర్చిపోయాడు కాని వారం రోజుల్లోనే జబ్బు పడ్డాడు. డాక్టర్ల దగ్గరకు పోయినా ఫలితం లేదు.

రోజులు గడుస్తున్నాయి – మందులు వాడుతున్నారు – డబ్బులు నీళ్ళల్లా ఖర్చవుతున్నాయి. అతని రోగం మటుకు కాస్త కూడా నెమ్మదించడం లేదు.

మనిషి తెగ నీరసించిపోయాడు. ఆహారం పోవడము లేదు. ఓ నర్సింగ్‌హోమ్‌లో కూడా చేర్పించారు. అయినా అంత మెరుగుదల కన్పించలేదు. తాయారుమటుకు ఇంటికి, నర్సింగ్‌హోముకు తిరగలేక చచ్చి సతమతమవుతున్నది.

ఓ ఉదయం ఓ కోయదొర భిక్షం కోసం యింటికి వచ్చాడు. తాయారు బియ్యం పెట్టగానే అతను నోరు విప్పాడు.

"ఓ పిట్టా ! నీ పుంజు గురించి విచారపడమాక – పుంజుకు సేతబడి అయింది. ఎంటనే తిప్పికొట్టించు – తగ్గిపోతుంది...." ఇలా చెప్పుకుంటూ పోయాడు.

అతన్ని తరిమేసిం తర్వాత ఆమె ఆలోచనలు ఆతను చెప్పిన విషయం వైపుపయనించేయి.

ఇక ఉండబట్టలేక వాళ్ల వీధిలో ఉన్న మంత్రాలమల్లన్న దగ్గరకు వెళ్ళింది. తన భర్త పరిస్థితి

చెప్పింది. ఆమెను మరునాడు రమ్మన్నాడు. ఎంతో టెన్షన్ ఫీలవుతూ ఆరాత్రి గడిపింది.

ఆ రాత్రి సాయికి కొంచెం సీరియసు కూడా అయింది.

అయినా మల్లయ్య ఏం చెబుతాడోనని అతను దగ్గరకు వెళ్ళింది.

"అయింది....చేతబడి అయింది...పదివేలు ఖర్చు అవుతుంది" చెప్పాడు మల్లన్న.

"అమ్మో ! అంత డబ్బే! నా దగ్గరలేదు."

"డబ్బు ముఖ్యమా? నీ భర్త ప్రాణం ముఖ్యమా? నువ్వు పట్టించుకోకపోతే అతన ఎక్కువ రోజులు బ్రతకడు. నీ అదృష్టంకొద్దీ నా దగ్గరికి వచ్చావు కాబట్టి తిప్పి కొడతాను" చెప్పాడు మల్లన్న.

"కాని ఆయనకు ఎవరూ శత్రువులు లేరే !?" అతను ఎవరితోనూ గొడవ పడడు. అతను పోవడం వలన ఎవరికీ లాభం లేదు" ఏడుస్తూ చెప్పింది.

"అతని నాలుకే అతని శత్రువు ! మనసు మంచిది కావచ్చు కాని వాక్కు పరుషం ! అదే యింత చేసింది." మల్లన్న చెప్పేడు.

"ఎవరుచేశారు?"

"అవన్నీ ఎందుకు ? ..... చెప్పకూడదు , నీ భర్త ప్రాణం కావాలంటే ఓ పదివేలు తీసుకురా ... అదీ మీకు కాబట్టి.. ఒకే వీధిలో ఉన్నామని. ఇంకోరికైతే ఇరవై వేలు తీసుకుంటా...." చెప్పాడు మల్లన్న.

"రేపు చెబుతాను స్వామీ!"

"టైం లేదు ...ఆ తర్వాత నేనుకూడా ఏం చెయ్యలేను... ఈ రాత్రే మొదలుపెట్టాలి. సాయంత్రం లోగా చెప్పు."

"అలాగే సాయంత్రం కనిపిస్తాను."

జరిగింది భర్తతో చెప్పి అడిగింది మీకు శత్రువులున్నారా అని.

ఒక గంట దీర్ఘంగా ఆలోచించిన మీదట తనకు, తిప్పయ్యకు జరిగిన సంభాషణ గుర్తుతెచ్చుకుని... వివరించాడు.

"అయినా స్వామి అలా చేస్తాడని అనుకోను. ఆయనది ఈ ఊరు కూడా కాదు. ఏదో ఉపన్యాసానికి వచ్చి వెళ్ళిపోయాడు..... ఆయనకు ఎవరు చెప్పి ఉంటారు?"

"ఇంకెవరు , ఆ తిప్పయ్యకాడే చెప్పి ఉంటాడు. ఫోను చేసో, లెటరు రాసో ?" ఏడ్చింది అలివేలుమంగతాయారు.

"అయినా మీ కెందుకండీ మీకు సంబంధించని విషయాలు? స్వాములతో , పాములతో ఆడుకోకూడదని తెలియ్యదా? ఏస్వామి ఎలా పోతే మనకేం? మనమెవరం ఒకళ్ళని విమర్శించడానికి ? ఏ పుట్టలో ఏ పాముందోనని ప్రతి పుట్టలోనూచేతులు పెట్టాలా? వెధవ నోరు...నోరు పడిపోతే బాగుండును" విలపించింది.

"చస్తే చచ్చాను ....మల్లన్న లాంటి వాళ్ళ చేతుల్లో వేలకు వేలు పోసి డబ్బు తగలెయ్యకు...అంతా మోసగాళ్ళు...." అతను ఇంకా ఏదో అనబోతూంటే అతని నోరు నొక్కేసింది రెండు చేతులతో మంగతాయారు.

అతన్ని ఎవరూ మార్చలేరని లేచి వచ్చేసింది. ఇంట్లో డబ్బులు లేవు. బ్యాంకులో ఉన్న డబ్బులు ఈ మందులకు మాకులకు ఖర్చయిపోయాయి.

మల్లన్న చెప్పింది నిజమా? అబద్ధమా?

మంత్రాలున్నాయా? చేతబడులున్నాయా? అంతా మూఢ విశ్వాసమే కదా? ఒక వేళ విమర్శించినంత మాత్రాన భగవంత స్వరూపుడైన స్వామిజి తన భర్తకు అపకారం తలపెడతాడా?

చేతులు నెత్తి కేసి కొట్టుకుంది. బంగారు గాజులు ఆమెనుదిటికి తగిలి నెత్తురు కారింది కొంచెం.

తన పసుపు కుంకుమలు పోయిం తర్వాత ఈ గాజులు ఎలాగూ ఉండవు. ఆఖరి ప్రయత్నం చేయదల్చుకుంది తాయారు.

తాయారు తయారై బ్యాంకుకు వెళ్లి గాజులు కుదువ పెట్టి అప్పు తీసుకుంది. ఓ పదిహేను వేలు వచ్చాయి. ఏదైతే అయిందని.... ఓ పదివేలు తీసుకెళ్ళి మంత్రాల మల్లన్నకి ఇచ్చింది.

"వస్తావని తెల్సు ....నీ అదృష్టం బాగుంది....నీకు అయిదోతనం నిలవాల్సిన రాత ఉంది. గంభీరంగా" మందహాసం చేశారు.

" ముందు నాభర్తని రక్షించండి....."

"ఇంకేం భయం లేదు ఈ వస్తువులు తీసుకురా!" అని కొన్ని చెప్పాడు.

గోళ్ళుభర్తచేతి గుర్తు, వెంట్రుకలు, పాదధూళి....ఇంకా అతని వేలిముద్రలు పడినవస్తువులు ...మరికొన్ని తీసుకుపోయి ఆ రాత్రి అందచేసింది.

ఆ రాత్రి సాయి ఆమెను తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టాడు. వాళ్ల పెళ్ళయిన తరువాత భార్యపైన అంతగా కోపం చూపించడం తిట్టడం అదే ప్రథమం.!

భరించలేక యింటి కొచ్చేసింది అలివేలు.

చిత్రంగా మరునాటి నుంచి అతని జబ్బు తగ్గుముఖం పట్టింది.

నవ్వుతూ ఉన్న భర్తను చూసేసరికి తాయారుకు చాలా సంతోషం కలిగింది. తను మొక్కుకున్న దేవుళ్లకి నమస్కరించింది.

మంత్రాల మల్లన్నకు పోయి చెప్పింది.

"ఇంకా బాగైపోతుంది... నేను రివర్సు చేసేశాను. ఇంకేం భయం లేదు..." చెప్పాడు మల్లన్న. అభయమిస్తూ.

పాద నమస్కారం చేసుకుని వచ్చేసింది.

"ఊరికే పదివేలు కొట్టేశాడు. ఒక్కరోజు నువ్వు ఆగి ఉంటే ఆ పదివేలూ మనకే మిగిలేవి" సాయి ఉవాచ.

ఆమె అతని నోరుమూసింది.

రెండు రోజుల్లో ఇంటికి వచ్చాడు. నర్సింగుహోమునుండి డిశ్చార్జి అయి.

"స్వామీ! నోరు జారనని నాకు ప్రామిస్ చేయండి. మీకు సంబంధించని విషయాలలో అనవసరంగా జోక్యం చేసుకోవద్దు..." తాయారు నిలదీసింది ఆఫీసుకు పోయేముందు.

"అబ్బే! నేనేం ఊరికే వాగడం లేదు. అవతలవాళ్ళు ఊరికే నన్ను రెచ్చగొట్టి నా అభిప్రాయం తెలుసుకుని అది ప్రచారం చేస్తున్నారు" విసుక్కున్నాడు సాయి.

"అందుకే అస్సలు మనం ఏమీ మాట్లాడకుండా ఉంటే సరిపోతుందిగా... అవతలి వాళ్ళు ఏమడిగినా నాకు తెలియదని చెప్పండి." అంటూ అతను ఎదుటివారితో ఎలా నడుచుకోవాలో బోధించింది.

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లాడు పుడతాడన్నట్లు... అతనికి ఇంటర్వ్యూ వచ్చింది ఆఫీసరు పోస్టుకు.

"తాయారూ! మనం ఈ ఊరునుంచి వెళ్ళిపోదాం! ఈ వాతావరణం వద్దు. ఈ ఆఫీసు గొడవలు వద్దు. ఇంటర్వ్యూలో సెల్కక్టయితే ఎక్కడో దూరంగా వేస్తారు. అదృష్టం బాగుంటే మన భాషరాని

రాష్ట్రాలకు కూడా మారుస్తారు,'' చెప్పాడు సాయి.

''మంచిది. అలాగే మీ ప్రయత్నం మీరు చేయండి. కాని అక్కడ కూడ ఇలాగే నోరు జారద్దు,'' వార్నింగు యిచ్చింది.

సాయిచరణ్ సెలవు పెట్టి ఇంటర్వ్యూకు ప్రిపేరవడము మొదలు పెట్టేడు. అతని ఆశలన్నీ రాబోయే ప్రమోషన్ మీదే!

జీతం పెరుగుతుంది. హోదా పెరుగుతుంది. ట్రాన్సువర్ వస్తుంది. ప్రస్తుతం వున్న చెడ్డ వాతావరణంలోంచి బయటపడవచ్చు.

ఆఫీసర్ని, మేనేజర్ని రికమెండ్ చేయమని ప్రాధేయపడ్డాడు. వాళ్ళు తప్పకుండా చేస్తామని చెప్పారు కూడ.

ఆరోజు దిగ్విజయంగా ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలన్నిటికి సమాధానం చెబుతున్నాడు. ఇంక గ్యారంటీగా తనకు ప్రమోషన్ వస్తుంది అనుకున్నాడు సాయి. కాని చివరిలో ఈ ప్రశ్న అడిగేరు అతన్ని...

''మీ ఆఫీసరు పైన నీ అభిప్రాయం?''

''మంచివాడు సార్...''

''ఆఫీసు పనిమీద...?''

''మంచి ఎఫిషియంట్ సార్...'' ''ఎక్స్‌పర్టు''

''అతనికి పనిరాదుట కదా... వట్టి అప్రయోజకుడట కదా! రూల్సు రెగ్యులేషన్స్ ఏవీ తెలియవుట కదా...! సర్క్యులర్లు కూడ నువ్వు చూపించాలిట కదా!''

''అబ్బే! అదేం లేదు సార్! ఆయనే మా అందరికీ గైడెన్స్ యిస్తూ ఉంటారు.''

''మిష్టర్ సాయీ! నీ హాబీస్ ఏమిటి?''

''రీడింగు బుక్స్ సార్''

''అట్లానా...! అమ్మాయిల్ని ఏడ్పించడం కాదా?''

''అమ్మాయిల్నా! నేనా! నేను శ్రీరామచంద్రుడి లాంటివాడిని. వాళ్ళజోలికి ఎందుకుపోతాను? నా పని నేను చేసుకుపోతాను... నాకు పెళ్ళయింది సార్!'' అమాయకంగా అన్నాడు.

''ఐసీ! ముద్దపప్పు పేరు ఎప్పుడన్నా విన్నావా?''

''ఎందుకు లేదు సార్! మా ఆవిడ వారానికి రెండుసార్లు చేస్తుంది.?''

''ఆ ముద్దపప్పు కాదయ్యా...! ఆ పేరుగల వ్యక్తి!''

''నాకు తెలియదు సార్!''

''సుహాసిని మీ కొలీగ్‌కదూ!''

''అవును సార్. కాని ఆమెను ముద్దపప్పు అంటారని నాకు తెలియదు సార్!'' బిక్కమొహం పెట్టాడు.

''ఆమె అబ్బాయిల వెంబడి తిరుగుతుందిట కదా!''

''నో నో సార్! ఆమె పతివ్రత... సీత సావిత్రి అనసూయల కోవకు చెందినది...'' చెప్పాడు సాయి చెమటలు పడుతూంటే...

''చూడు సాయీ! మైండ్ యువర్ బిజినెస్! అనవసరంగా ఒకళ్ల జోలికి వెళ్ళబోకు. మనమే ఈ లోకంలో తెలివిగల వాళ్ళమనుకుంటే పొరపాటు.... పండితులు కూడ తప్పులు చేస్తూ ఉంటారు. అలాగే ఆడపిల్లల జోలికి అసలు పోబోకు'' చైర్మన్ సలహా యిచ్చేడు.

"యస్సార్! నేను ఎప్పుడూ డీసెంటుగానే బిహేవ్ చేస్తాను. ఎవరికీ అపకారం చెయ్యను. ఎవరి దగ్గరా లంచం తీసుకోను. ఎప్పుడూ ఆఫీసుకి లేటుగా రాను ఎప్పుడూ ఫ్రెంచ్ లీవులో వెళ్ళను. సంతకం పెట్టి ఆఫీసులో పని ఎగ్గొట్టి సినిమాలకు, షికార్లకు పోను..." చెప్పాడు సాయి విద్యార్థి పంతులుకు పాఠం అప్పచెప్పినట్లు.

"అంటే యివన్నీ మీ కొలీగ్స్ చేస్తున్నట్లు కదా నీ ఉద్దేశ్యము....! అలా అని కంప్లెయింటు రాసివ్వగలవా? రాసిస్తే వాళ్ళమీద ఏక్షన్ తీసుకుంటాం...." ఛైరమన్ కోపంగా అన్నాడు.

"అబ్బే! అలా నేను చెప్పలేదు సార్! నాగురించి నేను చెప్పుకున్నా!" వినయంగా చెప్పాడు సాయి.

"మంచిది... ఆల్ ది బెష్ట.. యూ కెన్ గో!" ఛైర్మన్ సెలవిచ్చాడు.

సాయికి తల తిరిగిపోయింది.. వీళ్ళకేమైనా కర్ణ పిశాచి ఉందా.... లేదా దూరవిద్య ఏదయినా ఉందా? ఏ రకంగా ఊహిస్తున్నారని...

మొహం వేలాడేసుకుని వచ్చాడు యింటికి ఊరినించి.

తాయారు సంతోషంగా ఎదురు రాలేదు.. మూతి ముడుచుకుని ఓ మూల కూర్చుని ఉంది. అప్పుడే తన ఇంటర్వ్యూ విషయం ఆమెకెలా తెల్సిందని ఆశ్చర్యపడ్డాడు.

"తాయారు! ఏం జరిగింది? భాధపడకు. ఈ సారి సెలక్టు కాకపోతే ఇంకోసారి అవుతాను! నా మెరిట్ ఎవరూ కాదనలేరు!" ఓదార్చాడు సాయి.

"ఆ! ఇంటర్వ్యూ గురించి కాదండి... బోడి ప్రమోషను వస్తే ఎంత పోతే ఎంత కాని జీవితం" ..తాయారు కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

"ఏమయింది నీ జీవితానికి ? ఆఫీసరు భార్యే కానక్కర్లేదు ఆనందంగా ఉండడానికి నీకు ఏం తక్కువయింది?" అనునయించాడు.

"బుద్ధి, జ్ఞానం... తక్కువయ్యాయి" కస్సుమని లేచింది తాయారు.

"ఏం జరిగింది ? నిన్నెవరైనా ఏమన్నా అన్నారా?"

"ఆ( అయిపోయింది. వమా పిన్నిగారి తో నాకున్న బంధుత్వం కాస్తా కుప్పకూలిపోయింది..."

"ఏం పోయిందా పాపం!" సానుభూతిగా అన్నాడు సాయి.

"ఛీ! ఆమె పోలేదు... ఆమె మనతో సంబంధము తెగతెంపులు చేసుకుంది."

"మనమేం అపకారం చేశాం కనక.. పెట్టుపోతలు తక్కువయ్యాయ్యా?"

"ఊర్కోండి! అంతా మీ వెధవ నాలుక చేసిన పని! ఆ సుబ్బలక్ష్మి కాపురం నిలువునా కూలిపోయింది. డైవోర్స్‌కు అప్లై చేశారుట!"

"అయితే మనమేం చేస్తాం?"

"ఆ! వాళ్ళు అనడం... మీరు సుబ్బలక్ష్మి గురించి చాడీలు చెప్పడం మూలంగా ఇలా జరిగిందని...మీరు పరిచయం అయి....సుబ్బలక్ష్మి ఆరోగ్యం - అనారోగ్యం గురించి అవాకులు చెవాకులు చెప్పకముందు బాగానే ఉన్నారుట! తర్వాత కాస్త ఏ సుస్తీ చేసినా.... ఆసాయి చెప్పనే చెప్పాడు. చిన్నప్పటినించీ సుబ్బలక్ష్మి వట్టి రోగిష్టిదట అని ప్రచారం చేశారు. ఏదైతేనేం వాళ్ళ కాపురం కూలిపోవడానికి రాళ్ళెత్తిన కూలీల్లో మీరూ ఒకరు! ఊహూ( కాదు ...మా పిన్ని ఉద్దేశ్యం ప్రకారం మీరే ప్రధాన కారకులు! బాబూ! ఆనాలుకను కత్తిరించేస్తే బాగుండును." తాయారు రోదించింది.

ఈ సారి సాయి చరణ్‌కు నిజంగా తన మీద, తన నాలుక మీద రోత పుట్టింది. తన లూ జూటంగు మీద భరించరాని కోపం వచ్చింది. జారుడు నాలుకను ఎలా అదుపులో పెట్టుకోవాలో అర్థము కావడము లేదు.

అందుకే భగవంతుడు భాష యివ్వక పశువులను ఒకటి చేస్తే భాష యిచ్చి మనుషుల్ని వేరు చేశాడు. నాలుకలతోనే రాజ్యాలు కూలిపోయాయి. దుర్యోధనుడి, కర్ణుడి వాచాలత్వం కురుక్షేత్ర యుద్ధానికి, పద్దెమినిది అక్షౌహిణుల సైన్య నాశనానికి కారణం అయింది.

ఆ వాచలత్వంతో పోలిస్తే తనెంత, తన బ్రతుకెంత అనుకున్నాడు సాయి.

రచన ఇంటింటి పత్రిక : : జన్మదిన ప్రత్యేక సంచిక 2001

